

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## శ్రీమల్లికార్జునస్వామికి అన్నాభిషేకం





**బుచ్చి నవంబర్ 15 ప్రభాతవార్త** కార్తీమాసం పురస్కరించుకొని పవిత్రపుణ్య క్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో శ్రీమల్లికార్జునస్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. మొదట స్వామి వారికి రుద్రాభిషేకం, సహస్రనామార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పాలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అన్నాభిషేకం యొక్క విశిష్టత గురించి వివరించారు. కార్తిక పౌర్ణమి రోజున అన్నంతో అలంకృతమైన పరమేశ్వరుడ్ని దర్శించుకుంటే దారిద్ర్యం తొలగిపోతుందని తెలిపారు. అన్నాభిషేకం పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు సకల ఐశ్వర్యాలు కలిగి, సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా హైదరాబాద్‌కి చెందిన తంగేళ్ల ఆనంద్‌సుధాకర్, సాయిసత్య, సాయి కార్తిక్, రేష్మి, సాయి, లికిత్, వెంకటరమణారావు, రమేష్, సాయిసిరి, వివేన్‌సాయి కార్తికేయన్, బన్నీ ఉభయకర్తలుగా వ్యవహారించారు. అన్నాభిషేకం అనంతరం భక్తులు స్వామి వారికి టెంకాయలు ,దీపారాధనలు చేసి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు, ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు ఎం .శివకుమార్, గుమ్మా రఘురామయ్య, తిరుమూరు సుప్రజ, గుంటూరు కామేశ్వరీ ఆమలూరు విమల, గాయిత్రమ్మ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కనుపూరులో పట్టపగలు చోరీ



**వెంకటాచలం, నవంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కనుపూరు గ్రామంలో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి తాళపు బుర్రను కట్ చేసి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.25 లక్షల నగదు, 15 సవర్ల బంగారును అపహరించుకుని వెళ్లారు. వివరాల మేరకు కనుపూరు గ్రామానికి చెందిన వల్లూరు చెంచురామయ్య పని నిమిత్తం బయటకు వెళ్లగా భార్య సుకన్య అనారోగ్యం కారణంతో హాస్పిటల్‌కు వెళ్లింది. పని ముగించుకుని మధ్యాహ్నం 1 గంట సమయంలో ఇంటికి రాగానే ఇంట్లో తలుపుకు వేసిన తాళపు బుర్ర కట్ చేసి ఉండడంతో లోపలకి వెళ్లి పరిశీలించారు. బీరువాలో ఉంచిన నగదు, 15 సవర్ల బంగారును గుర్తు తెలియని ఆగంతకులు అపహరించుకుని వెళ్లారు. చెంచురామయ్య బాకీ నిమిత్తం అప్పు చెల్లించేందుకు రూ. 25 లక్షల నగదును ఇంట్లో ఉంచారు. ఒక్కసారిగా ఇంట్లో ఉన్న నగదు, బంగారు చోరీ కావడంతో చెంచురామయ్య ఆందోళనకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న వెంకటాచలం సీఐ గంగాధర్ సంఘటనా స్థలానికి చేరుకుని చోరీకి గల కారణాలను బంధువుల వద్ద నుంచి ఆరా తీశారు. వేలిముద్రల నిపుణులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. పట్టపగలే ఇంత భారీ మొత్తంలో చోరీ కావడంతో స్థానికులా... గుర్తు తెలియని బయటి వ్యక్తులా అనేది అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో చోరీ కావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 15, ప్రభాతవార్త:** వర్షాకాలపు సమస్యలను దృష్టిలో ఉంచుకుని సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులు స్థానికంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కమిషనర్ డి.హరిత ఆదేశించారు. స్థానిక 19/2 లెక్చరర్స్ కాలనీ సచివాలయాన్ని కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి సచివాలయం పరిధిలోని గృహాలు, కమర్షియల్ భవనాలన్నింటికీ చెత్త సేకరణకు యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయం కార్యదర్శులకు సూచించారు. సచివాలయ కార్యదర్శులంతా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ప్రతి రోజూ తప్పక ధరించాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించి క్షేత్ర స్థాయి వరకు ప్రజలకు సంక్షేమం అందేలా బాధ్యత వహించాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు.

## తాళాలు పగులకొట్టి దొంగతనాలు చేసే నిందితుడు అరెస్టు




**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 15, ప్రభాతవార్త:** జల్సాలకు అలవాటు పడి ఇళ్ల తాళాలు పగులకొట్టి దొంగతనాలు చేసే నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు టౌన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మంగళవారం స్థానిక బాలాజీ నగర్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విజయరావు ఆదేశాల మేరకు స్థానిక సిఐ కె.రాములు నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ కె.భోజ్యా వారి సిబ్బంది ఉదయం నగరంలోని హరనాథపురం మానస హోటల్ ముందు ఉండగా పట్టుకుని అతని వద్ద ఉన్న చోరీ సొత్తు 108 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి స్వాధీనపరచుకున్నామని పేర్కొన్నారు. నిందితుడు నెల్లూరు రూరల్ మండలం ఆకుతోట నివాసి అయిన దాసరి రాజేంద్ర, తండ్రి ఆదిమూర్తి, వయస్సు 22 సంవత్సరాలు అని తెలిపారు. సెంట్రింగ్, కార్పెంటర్ పనులు చేస్తూ మద్యానికి, జూదానికి అలవాటు పడి జల్సాలకు డబ్బులు సరిపోక తప్పుడు మార్గంలో సంపాదించాలని ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులకొట్టి దొంగతనాలకు పాల్పడే వారని తెలియజేశారు. నిందితుడు గతంలో పలు కేసులలో రిమాండ్‌కు వెళ్లాడని వివరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన బాలాజీనగర్ పోలీసులను నెల్లూరు టౌన్ డీఎస్పీ అభినందించారు.

## సహకార బ్యాంకు సంస్థకు ఎ గ్రేడ్ రావడం జిల్లాకే గర్వకారణం




**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 15, ప్రభాతవార్త:** సహకార సంఘాల బలోపేతానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సంస్థ చేపడుతున్న సంస్కరణలతో రాష్ట్రంలోనే నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు సంస్థకు ఎ గ్రేడ్ రావడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు కొనియాడారు. మంగళవారం సాయంత్రం నెల్లూరు గాంధీబొమ్మ సమీపంలోని కేంద్ర సహకార బ్యాంకు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ అఖిల భారత సహకార వారోత్సవాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార ఉద్యమానికి గొప్ప చరిత్ర ఉందని, స్వాతంత్ర్య సమర యోధులకు ఆర్థిక సహకారం అందించిన ఘనత సహకార సంఘాలకే దక్కిందని, మళ్లీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సహకార సంఘాల వైభవానికి అడుగులు పడడం శుభ పరిణామమన్నారు. జిల్లాలో కేంద్ర సహకార సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అనేక సంస్కరణలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 175 బహుళార్థ సాధక గోడౌన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో కూడా జిల్లా సహకార బ్యాంకు భాగస్వామ్యం కావాలని, జగనన్న ఇళ్ల నిర్మాణ లబ్దిదారులకు రుణాలు అందించి వారిని ప్రోత్సహించాలని, రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని, ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఏ కార్యక్రమం చేపట్టిన ప్రతి ఒక్కరూ సమిష్టిగా ముందుకు వస్తున్నారని, కరోనా సమయంలో ప్లాస్మా వితరణ చేసి దేశంలోనే నెల్లూరును ప్రథమ స్థానంలో నిలపడం ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 4వేల మొక్కలను నాటేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన 12.5 లక్షల మొక్కల్లో ఇప్పటివరకు 75వేల మొక్కలు నాటామని, ప్రతి ఒక్కరు కూడా తమ వంతు బాధ్యతగా కనీసం ఒక మొక్క అయినా నాటాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తొలుత బ్యాంకు ప్రాంగణంలో మొక్కలు నాటిన కలెక్టర్, సహకార వారోత్సవాల పోస్టర్ల ను ఆవిష్కరించారు. జిల్లా సహకార అధికారి తిరుపాల్ రెడ్డి, ఎన్‌డీసీసీ బ్యాంకు సీఈవో శంకర్‌బాబు, నాబార్డ్ డిడిఎం రవిసింగ్, మత్స్యశాఖ జాయింట్ కలెక్టర్ నాగేశ్వర రావు, సహకార సంఘాలసభ్యుల, రైతులు పాల్గొన్నారు.

## సచివాలయాల పరిధిలోనే ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించాలి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 15, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాకుండా, స్థానిక సచివాలయాల పరిధిలోనే ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపించాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని రామలింగాపురం 19, 19/1 సచివాలయాలను నగర కమిషనర్ హరితతో కలిసి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆకస్మిక తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది క్రమశిక్షణతో పని చేసి ఎటువంటి దరఖాస్తులు పెండింగ్ లేకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బంధీగా చేపట్టాలని, ఓటరు కార్డులో తపఉ్పలు, డోర్ నెంబర్ల మార్పు, పోలింగ్ స్టేషన్‌ల వారీగా జాబితాను సక్రమంగా తయారు చేయాలని పేర్కొన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించి ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సరి చేసి వారికి తెలియజేయాలన్నారు. డోర్ నెంబర్ల వారీగా కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా ఓటర్ల జాబితా తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు. వచ్చే నెలలో అమలు చేయనున్న ఈబీసీ నేస్తం, లా నేస్తం, పలు కారణాలతో పథకాలు అందని లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఈ వారంలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవ చేయాలన్నారు. ఆర్ఐ కృపాకర్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలి

**ఆత్మకూరు, నవంబర్15, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీభాగ్ ఒడంబడిక స్ఫూర్తితో వికేంద్రీకరణకు మద్దతుగా బుధవారం ఉదయం 10గంటలకు ఆత్మకూరు ఆర్టీసి డిపో నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

## డిఆర్ పేరు మీద అవార్డు తీసుకోవడం సంతోషంగా వుంది



**కావలి, నవంబరు 15 ప్రభాతవార్త** సన్మానాలు, అవార్డులు అన్నా కొంత ఇబ్బందిగా వుంటుందని అయితే తన బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం అన్ని కావలి విశ్వోదయ విద్యాసంస్థలలో జరిగాయని అందుకు కారకులైన కావలి విద్యా ప్రదాత డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి(డిఆర్) పేరు మీద తనను గౌరవిస్తున్నందున చాలా సంతోషంగా వుందని ప్రముఖ మానవ హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్ తెలిపారు. కావలి జవహర్ భారతి కళాశాల ఆవరణలోని యంయం హాలులో విశ్వోదయ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రముఖ మానవ హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్‌కు డిఆర్ విశ్వోదయ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును విశ్వోదయ యాజమాన్యం ఆధ్వర్యంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ అవార్డుతో పాటు 25 వేల రూపాయల నగదు అందజేసి దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అవార్డు గ్రహిత హరగోపాల్ మాట్లాడుతూ సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. స్వార్థం వున్న వారినే గొప్పగా కొనియాడుతున్నారన్నారు. అలాంటి సమాజంలో ఇంకా మానవతా విలువలు పాటిస్తూ డిఆర్ విద్యాసంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీన వర్గాల వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఆయన ఆశయాలను కుమారులు దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి. దొడ్ల విద్యాధరకుమార్‌రెడ్డిలు నెరవేరుస్తున్నారన్నారు. అదే బాటలో ఈ జీవిత సాఫల్య అవార్డు ప్రతి ఏట సమాజంలో స్థిత ప్రగ్నులను గుర్తించి సత్కరించడం గొప్ప విషయమన్నారు. ఈ సభలో ప్రముఖ పత్రికా సంపాదకులు కె.రామచంద్రమూర్తి, విశ్వోదయ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, జవహర్ భారతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, విశ్వోదయ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.ద్వారకనాథ్‌చౌదరి, విశ్రాంత ప్రొఫెసర్ కోటిలింగం, విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు.

## మినీ లారీని ఢీకొట్టిన లారీ.. ఇద్దరు కూలీలు దుర్మరణం









**కావలి రూరల్, నవంబరు 15 ప్రభాతవార్త** బతుకుదెరువు కోసం పొట్ట చేతపట్టుకొని తమ స్వస్థాలాలను వదిలి జీవనోపాధి కోసం వెళ్లిన 20 మంది కూలీలు మినీ లారీలో తిరిగి స్వగ్రామాలకు వస్తుండగా నెల్లూరు నుండి ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ అతివేగంగా మినీ లారీని వెనుక నుంచి కావలి జాతీయ రహదారి తుమ్మలపెంట ఫ్లైవోవర్ బ్రిడ్జి సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కూలీలు కొండమోది ఆదాము(45), దగ్గుమళ్ళ యోకోబులకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. మంగళవారం వేకువజామున ఈ ప్రమాదం జరిగింది. కూలీల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలావున్నాయి. బాపట్ల జిల్లా పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన 20 మంది వ్యవసాయ కూలీలు తమ స్వగ్రామానికి మిని లారీలో బయలుదేరారు. మినీ లారీలో నాయుడుపేటకు చెందిన లారీ డ్రైవర్ గిరిబాబుతో కలిసి వెళ్తుండగా మార్గమధ్యంలోని కావలి జాతీయ రహదారి తుమ్మలపెంట ఫ్లైవోవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం వేకువజామున 2.30 గంటల సమయంలో కాలకృత్యాల కోసం ఆపారు. ఆ సమయంలో నెల్లూరు నుండి ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ అతివేగంగా వచ్చి మినీ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండమోది ఆదాము, దగ్గుమళ్ల యోకోబులకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. కొండమోది జ్యోతి, సారమ్మ, బాలయపల్లి దావీదు, బల్లాపల్లి పరిశుద్ధ, దాసరి పాప, దాసరి పోలయ్య, కనపర్తి బుల్లెమ్మ, చీకటి రత్నకుమారి, కొండమోది లూధియాలను బలమైన గాయాలయ్యాయి. వీరిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కావలి డిఎస్పీ యం.వెంకట రమణ, కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్, వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కావలి రూరల్ ఎస్ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాణ్యమైన సేవలతో మంచి పేరు తెచ్చుకోవాలి




**నెల్లూరురూరల్, నవంబరు15 ప్రభాతవార్త** నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా మెడికవర్ యాజమాన్యం మంచిపేరు తెచ్చుకోవాలని వ్యవసాయ, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి సూచించారు. రూరల్ పరిధిలోని మెడికవర్ హాస్పటల్‌లో మంగళవారం గుండాల పద్మనాభరెడ్డి ప్లాటినం బ్లాక్ పేరుతో నిర్మించిన 18సూట్‌రూములను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేదవానికి కార్పోరేట్ వైద ్యం అందాలన్న ఉద్దేశ్యంతో దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆచరణయోగ్యం చేశారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తోన్న మెడికవర్ యాజమాన్యాన్ని అభినందించారు. కథానాయకుడు సూపర్‌స్టార్ కృష్ణ మృతికి సంతాపం తెలిపారు. మెడికవర్ చైర్మెన్, ఎండి డాక్టర్ అనిల్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఆత్మకూరువాసిగా జిల్లా ప్రజలకు మేలు చేశే ఉద్దేశ్యంతో మెడికవర్‌ను నెల్లూరులో ఏర్పాటు చేశామన్నారు. కాన్సర్ వ్యాధిని నియంత్రించేందుకు నెల్లూరులో ఇస్టిట్యూట్‌ను నెలకొల్పానన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హరికృష్ణ మట్లాడుతూ, ప్రారంభానికి విచ్చేసిన మంత్రి కాకాణి తదితర అతిధులకు ధన్యవాదాలు తెలిపారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, సెంటర్‌హెడ్ డాక్టర్ గణేష్, డాక్టర్ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గండి పాళెం గురుకుల పాఠశాలలో క్షణ...క్షణం..భయం...భయం



**ఉదయగిరి నవంబర్ 15 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలోని బోజనాల భవనం యొక్క పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నది,1982లో నిర్మించిన ఈ భవనంలోనే విద్యార్దులకు బోజన సదుపాయాలు జరుగుచున్నవి. సుమారు 4 వందల పైగా ఉన్న విద్యార్దులు,15 మందికి పైగా ఉన్న ఉపాధ్యాయులు ఈ భవనంలో భోజనం చేయాల్సి ఉంది. గత కొన్ని సంవత్సరాల నుండి వర్షాల వల్ల ఈ భవనం యొక్క శ్లాబ్ పెచ్చులు ఊడిపోయాయి. విద్యార్దులు డైనింగ్ హాల్‌లో కూర్చుని బోజనం చేయాలంటే శ్లాబ్‌ను చూస్తు ఏక్షణంలో ఏ పెచ్చి ఊడి పైన బడుతుందోనని బోజనం చేయాల్సిన పరిస్థితి.ఆరుబయట కూర్చుని బోజనం చేద్దామంటే వర్షాల వల్ల చిత్తడిగా మారిన నేల ఇబ్బందికరంగా ఉంది. వంట చేసే గది పరిస్దితి మరింత దారుణంగా తయారు అయింది. ఇక్కడ పెచ్చులతోపాటు,సీలింగ్‌కి ఉన్న ఇనుపచువ్వలు ఊడిపోయి వర్షపు నీరు దారగా కారుతున్నాయి. అలాగే స్టోర్ రూం పరిస్థితి అయితే స్టోర్ కీపర్ 24 గంటలు అక్కడే కూర్చుని ఎటువైపు నీరు పడవో అటు వైపు సామాను మార్చుకుంటు నీరు పడిన చోట నీటిని శుభ్రం చేసుకుంటు 24 గంటల ఆగదిలోనే ఉండవలసిన పరిస్థితి.నేడు ప్రభుత్వం నాడు-నేడు పధకం కింద ఎన్నో స్కూల్స్ రూపురేఖలు మారుస్తు విద్యార్దులకు మంచి భవిష్యత్తును ఇస్తున్నది.అలాగే గండిపాళెం గురుకుల పాఠశాలలోని బోజన శాల పరిస్థితిపై దయచూపి ఈ బిల్డింగ్‌నుప త్వరితగతిని కొత్త బిల్డింగ్ ఏర్పాటు చేసి పిల్లల ప్రాణాలకు ఏలాంటి హాని కలుగకుండా చేయాలని పాలకులను, ప్రభుత్వ అధికారులను, విద్యార్దులు అభ్యర్దిస్తున్నారు.

## నరసాపురంలో వైద్య పరీక్షలు



**గుడ్లూరు, నవంబరు 15, ప్రభాతవార్త :** మండలంలోని నాయుడుపాలెం సచివాలయం పరిధిలోని నరసాపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం డాక్టర్ పి.మారుతిరావు ఆధ ర్యంలో మంగళవారం నిర్వహించారు. మొత్తం 62మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న రోగులను వారి ఇళ్ల వద్దకు వెళ్ళి పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందజేశారు.

## కుష్టువ్యాధిగ్రస్తుల సర్వే



**గుడ్లూరు, నవంబరు 15, ప్రభాతవార్త :** 15వ తేదీ నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు జరుగు ఎల్‌సీడీసీ కార్యక్రమం(లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కార్యక్రమంలో భాగంగా గుడ్లూరులోని 16వ సచివాలయంలో అనుమానిత కుష్టువ్యాధిగ్రస్తుల సర్వే మంగళవారం నిర్వహించడం జరిగింది. వైద్యులు ఎల్.సాయిప్రియాంక ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాజంలో కుష్టు వ్యాధి ఉన్న వారిని ఈ సర్వే ద్వారా గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఆశా కార్యకర్తలు,వాలంటీర్లు కలసి ప్రతిరోజు వారి పరిధిలోని 20 ఇళ్లలోని సభ్యులను కలసి వారి శరీరంపై ఎలాంటి మచ్చలు ఉన్నను గుర్తించి వైద్యాధికారులకు తెలియపరుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వికలాంగులను మోసం చేసిన ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



**గుడ్లూరు, నవంబరు 15, ప్రభాతవార్త :** 2019 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత సీఎం అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే వికలాంగులకు వైకల్యం 40శాతం ఎక్కువ ఉన్న వారికి సదరన్ సర్టిఫికేట్ ద్వారా వికలాంగులకు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి గెలిచి మూడు సంవత్సరాలు అయినా పింఛన్ మంజూరు కాలేదు, గుడ్లూరు శివాలయం సంఘంలో నివాసం ఉంటున్న ఎస్టీ కులానికి చెందిన ఏడుకొండలు అనే వ్యక్తికి ఆటో ప్రమాదంలో కుడికాలు తీసివేయడం జరిగింది. ఈ ప్రమాదం జరిగి రెండు సంవత్సరాలు అయినా అధికార నాయకులు పంచాయతీ అధికారులు, వాలంటీర్ వ్యవస్థ సహకరించలేదు. పంచాయతీ అధికారులకు చెప్పినా ఫలితం లేదని తనకు ఉపాధి లేదని అవస్థలు పడుతున్నాడని అదేప్రభుత్వ పథకాలు అందకపోవడం పాతబడిన ఇల్లు విద్యుత్ మీటరు లేకపోవడం చీకటిలో ఉంటున్నామని కనీసం వంట చేసుకోవడానికి గ్యాస్ కూడా లేదని కుటుంబ సభ్యులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మండల జనసేన నాయకులు అన్నంగి చలపతి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వీడియో ద్వారా చెప్పడం జరిగింది. గడపగడపకుతిరుగుతున్నటువంటి స్థానిక ఎమ్మెల్యే, అధికార నాయకులకు పంచాయతీ సిబ్బందికి ఈ సమస్యలు కంటికి కనిపించడం లేదా ఇకనైనా సంబంధిత అధికారులు ఈ వికలాంగుని సమస్యలను పరిష్కరించి వారికి పింఛను మంజూరు చేయాలని లేనిపక్షంలో జనసేన పార్టీ దీనిపై తీవ్రచర్యలు తీసుకుంటుందని గుడ్లూరు మండల జనసేన నాయకులు అన్నంగి చలపతి అన్నారు.

## సంగం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



**సంగం నవంబర్ 15 ప్రభాతవార్త:** గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం లైబ్రరియన్ రవీంద్రరెడ్డి పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యులు శ్రీనివాసులురెడ్డి, వెటర్నరీ వైద్యులు సురేష్ గ్రామ పెద్దలు కంఠాబత్తిన రవీంద్రరెడ్డి, పుస్తక ప్రదర్శన ప్రారంభించారు.ఈకార ్యక్రమాన్ని సంగం ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు తిరుపతయ్య, వికాస్ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు హాజరైయ్యారు.పుస ్తక ప్రదర్శనలో పుస్తకాలు తిలకించారు.ఈ సందర్భంగా గ్రంధాలయంలో పుస్తకాలు తిలకించిన వారు వారి అభిప్రాయాలను వెల్లడించారు.చిన్న తనం నుండి పుస్తకాలు చదవడం నేర్చుకోవాలని ప్రతి ఒక్కరు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్దులు,ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు పుస్తక ప్రదర్శనను తిలకించారు.

## ఉప్పలపాడు చెరువు వేలం 19న

**అనంతసాగరం, నవంబర్15, ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం ఉప్పలపాడు గ్రామంలోని నల్లచెరువు కు ఈనెల 19న వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు 10వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాలని ఆయన కోరారు.

## విడవలూరు గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన



**విడవలూరు నవంబర్ 15 ప్రభాతవార్త:** విడవలూరులోని గ్రంధాలయంలో మంగళవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లైబ్రరియన్ ఏ నిరూపు ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా అక్షర ఇంగ్లీషు మీడియం, జిల్లా పరిషత్ హైస్కూల్ నుండి విద్యార్దులు వచ్చి పుస్తక ప్రదర్శన తిలకించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, విజయ్‌కుమార్, రమేష్ ,శ్రీనివాసులు వ్యవహారించారు. మాదకద్రవ్యాలపై విద్యార్దులకు అవగాహన కల్పించారు. విద్యార్దులు, విద్యార్దుల తలిదండ్రులు,ఉపాధ్యాయులు,గ్రామస్తులు పాల్గోన్నారు.

## నిరుపేద వృద్దులకు నిత్యావసర సరుకులు అందజేసిన పద్మావతి శ్రీదేవి



**కావలి, నవంబరు 15 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ మహిళా నేత పద్మావతి శ్రీదేవి తన స్వీయ నిధులతో భారీ వర్షాలతో ఇబ్బందిపడుతున్న కావలి మద్దూరుపాడు, చంద్రబాబునగర్, వెంగళరావునగర్‌లోని నిరుపేద వృద్దులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. బిజెపి కావలి నియోజకవర్గ కన్వీనర్ సి.వి.సి.సత్యం, పట్టణ బిజెపి అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం చేతుల మీదుగా 5 వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులు నిరుపేద వృద్దులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్బంగా పద్మావతి శ్రీదేవి మాట్లాడారు. కొందరు నేను చేసే సేవను విమర్శిస్తున్నారన్నారు. తనకు డబ్బుంది చేస్తున్నారని అంటున్నారని మాకు వందల కోట్లు లేవని మాకు వున్న దానిలో సహాయం చేస్తున్నానన్నారు. నేను పర్యటించిన చోట్ల ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆహార పొట్లాలు పంపిణీ చేశారని మాకు అందలేదని బాధితులు చెప్పడంతో నేను నిత్యావసర వస్తువులు అందజేయడం జరిగిందన్నారు. భారీ వర్షాలకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పంచిన ఆహార పొట్లాలు సొంత నిధులతోనో లేక ప్రభుత్వ నిధులతో పంపిణీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ పార్టీ పరంగా ఎక్కవ ఏ అవసరం వచ్చినా ప్రజల తరపున ముందుండి పోరాడతామన్నారు. సి.వి.సి.సత్యం మాట్లాడుతూ కరోనా సమయంలో బిజెపి రాష్ట్ర నేత, కందుకూరి గ్రూప్ చైర్మన్ కందుకూరి సత్యనారాయణ పేదలను ఆదుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి వాయిగండ్ల సుధీర్, మండలం కిరణ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

## కావలి నూతన డిఎస్పీని సత్కరించిన జనసేన నేతలు



**కావలి, నవంబరు 15 ప్రభాతవార్త:** కావలి నూతన డిఎస్పీ యం.వెంకట రమణను మంగవారం జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో జనసేన నేతలు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్బంగా సుధాకర్ మాట్లాడుతూ కావలి శాంతిభద్రతలను నిష్పక్షపాతం కాపాడతారని కోరుకుంటున్నామని తెలిపారు. మీ హయాంలో కావలి శాంతియుతంగా వుంటుందని ఆశిస్తున్నామని తెలిపారు. జనసేన పార్టీ తరపున మీకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బయ్య, కోఆర్డినేటర్ తిరుమలశెట్టి సుధీర్, నాయకులు శంకరయ్య, రజనికుమార్, వర్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా



**మనుబోలు, నవంబరు 15 ప్రభాతవార్త:** స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు మంగళవారం వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో నిరసన ఆందోళన చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు తలారి దేవదానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా దేవదానం మాట్లాడారు. కాగితాలపూరు గ్రామంలో పేదలు సాగుచేసుకుంటున్న భూములకు ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. వీటిపై గత 30 ఏళ్లగా పోరాటాలు చేసి కేసుల్లో ఇరుకున్నా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. ప్రస్తుతం ఆ గ్రామంలో వక్ఫ్‌బోర్డు భూములంటూ బౌండరీలు నాటారని పేదలకు అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి పేదలకు ఆ భూములు ఇవ్వమని చెప్పినా రెవెన్యూ వారు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. సీలింగ్ భూములు పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ సుధీర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బ్రహ్మయ్య, రాగవయ్యలు వినతి పత్రం అందజేశారు.

## కన్స్యూమర్ రైట్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సాయికుమార్



**వింజమూరు, నవంబర్15, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ఫోరం నెల్లూరుజిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా స్థానిక శివాలయం పూజారి కోవూరు సాయికుమార్‌ను ఎంపికచేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు డి.తిరుపాలు , నియోజకవర్గ అధ్యక్షుడు కదిరి రంగారావ్‌లు తెలిపారు. ఈసందర్భంగా తిరుపాలు మాట్లాడుతూ ఉత్తమ భావాలు కలిగిన వారు పేద ప్రజల పక్షాన పోరాటం చేయగలవారు కన్స్యూమర్ రైట్స్ ఫోరంలో చేరి 10మందికి సాయం చేయగలిగిన వారికి అవకాశం కల్పిస్తారన్నారు. నూతనంగా ఎంపికైన సాయికుమార్ ఉత్తమ భావాలు కలిగిన వ్యక్తి అని పేదలకు సేవ చేసేందుకు తమ ఫోరంలో సభ్యుడు కావడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ పేదల ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన అధ్యక్షుడు తిరుపాలుకు, నియోజకవర్గ అధ్యక్షుడు కదిరి రంగారావ్‌కు , గౌరవాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఫోరం ఇచ్చిన బాధ్యతను సమర్ధవంతంగా సద్వినియోగం చేస్తూ ప్రజలకు సేవ చేసి సంస్థకు మంచి పేరు తెస్తానన్నారు.

## సూక్తి శతకం గ్రంథం ఆవిష్కరణ



**వెంకటాచలం, నవంబరు 15, ప్రభాతవార్త:** భగవాన్ వెంకయ్యస్వామి గురించి సహకార సంస్థ విశ్రాంతి డిప్యూటీ రిజిస్ట్రార్ కనపర్తి చెరబయ్య రచించిన సూక్తి శతకం అను గ్రంథాన్ని మంగళవారం వెంకయ్యస్వామి ఆశ్రమ కార్యాలయంలో ఈవో బాలసుబ్రహ్మణ్యం కమిటీ సభ్యులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. వెంకయ్యస్వామి జీవిత చరిత్ర, ఆయన చేసిన కార్యక్రమాల గురించి పుస్తకంలో క్లుప్తంగా రచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ మెట్టు సుధాకర్‌రెడ్డి, పంచాక్షరి బాలసుబ్రహ్మణ్యం, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సూపర్‌స్టార్ కృష్ణకు నివాళి

**వింజమూరు, నవంబర్15, ప్రభాతవార్త:** సూపర్‌స్టార్ కృష్ణ హఠాన్మరణం ఆయన అభిమానుల్లో విషాదం నెలకొంది. మంగళవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో కృష్ణ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘ నాయకులు రమేష్, కోటేశ్వరరావ్, కొండా వెంకటేశ్వర్లు, సోమిశెట్టి శేషారావ్, మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, గూడా నరసారెడ్డి, కరకల మహేష్ పాల్గొని అశ్రునివాళులర్పించారు. ఈసందర్భంగా అభిమాన సంఘ నాయకులు మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ తమను వదిలి వెళ్ళడం నమ్మశక్యం కావడం లేదని , ఆయన మంచి మనసు కలిగిన హిమాలయ పర్వతమని, సాహసానికి ఊపిరిగా , ధైర్యానికి పర్యాయపదంగా, ధైర్యం, సాహసం, పట్టుదల , మానవత్వం, మంచితనం వీటి కలయబోతే నటశేఖరుడు కృష్ణ అన్నారు. అటువంటి మహామనిషి సినీ తెలుగు పరిశ్రమలోనే కాదు భారత సినీ పరిశ్రమలోనే అరుదైన వ్యక్తి అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ తలెత్తుకోగల అనేక సాహసాలు చేసిన కృష్ణ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఆయన లేని లోటు సినీ పరిశ్రమకు, అభిమానులకు ఎప్పటికీ తీరనిదన్నారు .ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో సుబ్బయ్య, కోటేశ్వరరావ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప



**వింజమూరు, నవంబర్15, ప్రభాతవార్త:** వింజమూరు పట్టణంలోని మద్దూరు పాపిరెడ్డి నగర్‌లో వెలసియున్న అయ్యప్ప ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా అశోక్, తనూజ , భువనేశ్వరి , పద్మ లు వ్యవహరించారు. ముందుగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సుబ్రహ్మ ణ్యస్వామి అష్టోత్రం నిర్వహించారు. అనంతరం గురుస్వాములతో కలసి కర్పూరనీరాజన హారతి అందించారు. , ఉభయదాతలు అయ్యప్ప భక్తులకు, గోవిందభక్తులకు, శివభక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయకర్త అశోక్ మాట్లాడుతూ అయ్యప్పభక్తులకు బిక్షను ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. తన తండ్రిగారైన పులి బాలయ్య జ్ఞాపకార్థం , తన కుమారుడి గౌతంనందన్ పుట్టిన రజును పురస్కరించుకొని ఆలయంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

## పుస్తకపఠనం వలన మేధాశక్తి పెరుగుతుంది



**అనంతసాగరం, నవంబర్15, ప్రభాతవార్త:** పుస్తకపఠనం వలన మేధాశక్తి పెరుగుతుందని అనంతసాగరం మండల విద్యాశాఖాధికారి ఎం.బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన అనంతసాగరంలోని గ్రంథాలయంలో మంగళవారం రెండవరోజు గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎంఇఒ హాజరయ్యారు. బాలసాహిత్యానికి చెందిన పుస్తకాల ప్రదర్శనను ఎంఇఒ రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయడం వలన మేధాశక్తి పెరుగుతుందని , ఈ రోజుల్లో పిల్లలు సెల్‌ఫోన్‌లకే పరిమితమవుతున్నారని దాని వలన రాబోయే రోజుల్లో ఎన్నో రుగ్మతలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. షేక్ అహ్మద్ దేశ విదేశ కరెన్సీ నాణ్యాల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు ప్రతిభాపరిక్ష, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ భాండాగారి నారాయణ, జెవివి నాయకులు, వేము పెంచలయ్య పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు




**కోవూరు, నవంబరు15 ప్రభాతవార్త :** అన్ని రకాల పుస్తకాలను ఒక చోట చేర్చి పరిరక్షించే ప్రదేశాన్ని గ్రంథాలయాలు అంటారని, ఈ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలుగా నేటికీ చెక్కు చెదరని ఆదరణతో విలసిల్లుతున్నాయనివైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన తెలిపారు. కోవూరు మండలం నేతాజీ నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన బాండాగారాలుగా పేరు పొందిన ఈ గ్రంథాలయాల్లో భవితకు విద్యార్థులు బంగారుబాటలు వేసుకోవచ్చన్నారు. పుస్తకాలను చదివి వాటిని ఆకళింపు చేసుకుని విజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే పుస్తక పఠనం తప్పనిసరి అన్నారు. ఎంతటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా పుస్తకం యొక్క ప్రాధాన్యత తగ్గలేదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ , క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎన్. ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## జస్టిస్ అన్సారీ స్మారక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



**నెల్లూరు టౌన్, నవంబరు 15, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ప్రెస్ క్లబ్ వద్ద నిర్వహిస్తున్న జస్టిస్ అన్సారీ స్మారక గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించడం జరిగిందని గ్రంథాలయ అధికారి చంద్రగిరి ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో నిలువ ఉన్న వివిధ రకాల పుస్తకాలను పాఠకుల కోసం ప్రదర్శించడం జరిగిందని, ఈ ప్రదర్శన వలన పాఠకులకు తమకు కావలసిన పుస్తకాలను చదివేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు స్వాతంత్ర్య ఉద్యమం పాల్గొన్న వారి జీవిత చరిత్ర పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని, ప్రతి ఒక్క విద్యార్థి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్, ప్రకాష్, రెగ్యులర్ రీడర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద బ్రాహ్మణుడుకి మిత్రులు వైద్య సాయం



**కావలి రూరల్, నవంబరు 15 ప్రభాతవార్త** పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కావలి పట్టణానికి చెందిన పేద బ్రాహ్మణుడు పాలపర్తి శ్రీను గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితులు సరిగా లేక మెరుగైన వైద్యం చేయించుకోలేక కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకొన్న 1983 సంవత్సరంలో విశ్వోదయ బాలుర పాఠశాలలో 10వ తరగతి చదివిన కొంతమంది మిత్రులు మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, పాబోలు మధు, పొన్నూరు రవి, షంషాద్, మరికొంత మంది మిత్రులు తమ స్నేహితుడు పాలపర్తి శ్రీనుకు మెరుగైన వైద్యం అందించేందుకు కావలిలోని గుండెమడుగుల దేవదానం మెమోరియల్ వైద్యశాలలో చేర్పించారు. ప్రజా వైద్యులు, కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు పర్యవేక్షణలో తగు సూచనలు, సలహాలతో పేద బ్రాహ్మణుడు పాలపర్తి శ్రీనుకు మెరుగైన వైద్యం చేయిస్తూ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారు. కార్తీక మాసంలో పేద బ్రాహ్మణుడుకి వైద్య సాయం చేస్తున్న మిత్రులను పలువురు అభినందించారు. మెరుగైన వైద్యం చేయిస్తున్న మిత్రులకు పాలపర్తి శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

## వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం



**సీతారామపురం, నవంబర్ 15 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు ప్రభుత్వ సర్వీసులను ప్రజలకు అందిస్తు, 17 విభాగాలలో స్థిరమైన అభివృద్ధి లక్షా ్యలను 2030 వ సంవత్సరం లోపు సాధించే దిశగా అడుగులు వేస్తుందని ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పస్టుప్లాన్ ఆప్‌యాక్షన్‌లో భాగంగా మారంరెడ్డిపల్లి సచివాలయంలోని వాలింటరీలకు , పంచాయితీ కార్యదర్శులు షేక్ ఖాదర్‌భాషా,గోవర్ధన్‌రెడ్డిల పర్యవేక్షణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అయిన ఫస్ట్‌ప్లాన్ ఆప్‌యాక్షన్‌లో భాగంగా లైన్ మరియు మోడల్ డిపార్టమెంటల్‌పై వాలంటీర్లకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

## అప్పసముద్రం విద్యార్థులకు కంటి పరీక్షలు



**ఉదయగిరి నవంబర్ 15 ప్రభాతవార్త** నేషనల్ కంట్రోల్ ఆఫ్ బ్లయిండ్‌నెస్ స్కూల్ విద్యార్థి,విద్యార్థినులకు కంటి స్క్రీనింగ్ ప్రోగ్రామ్ వైద్యులు ఎన్ కోటేశ్వరరావు నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని అప్పసముద్రం ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు దృశ్య బలహీన పరీక్షలను ప్రభుత్వ వైద్యులచే నిర్వహించారు. అత్యుతన్నత చదువుతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. చదువు పేదరికానికి అడ్డుకాకుడదని ప్రతి విద్యార్థిని,విద్యార్థికి చదువుతోపాటువైద్యం కూడ ముఖ్యమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భూసర్వే వేగవంతంగా జరుగుతుంది



**విడవలూరు నవంబర్ 15 ప్రభాతవార్త** మండలంలో భూసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తహసిల్దారు కె. చంద్రశేఖర్ తెలిపారు. వావిళ్ల,దంపూర్ ,అలగానిపాడు, గ్రామాలలో భూ సర్వే పూర్తి అయిందని ఆయన చెప్పారు. మండలంలో జగనన్న ఇండ్లకు అప్రూవల్ పంపివున్నామని త్వరలో జగనన్న ఇళ్ళు మంజూరు అవుతాయని ఆయన వివరించారు. మంజూరు అయిన వెంటనే ఇండ్లు లబ్దిదారులకు అందించగలమని తెలిపారు. జగనన్న లేవుట్ల కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఆయన చెప్పారు.

## జువ్వలదిన్నె సచివాలయం ఆకస్మిక తనిఖీ




**బిట్రగుంట, నవంబరు 15 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సచివాలయాన్ని మంగళవారం కావలి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి కనకదుర్గాభవానీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు సిబ్బంది పనితీరుపై ఆమె ఆరా తీశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన పథకాలైన వైఎస్ఆర్ కళ్యాణమస్తు, ఆయుష్మాన్, అక్షర చైతన్య కేంద్రాలు వంటి వాటిపై వాలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి లబ్ది చేకూర్చేలా కృషి చేయాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా సచివాలయ సిబ్బంది డ్రస్ కోడ్ విధిగా పాటించాలని, స్పందన కార్యక్రమంలో అన్ని శాఖల కార్యదర్శులకు పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించి పోర్టల్‌లో నమోదు చేసి అక్కడికక్కడే పరిష్కారమయ్యేవి పరిష్కరించి మిగిలినవి ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎంపిడివో ఆర్. గోవిందరావు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలు తనీఖి చేసిన స్క్వాడ్



**సీతారామపురం నవంబర్ 15 ప్రభాతవార్త** జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరెండెంట్ ఆదేశాల మేరకు నెల్లూరు ఇఎస్ స్క్వాడ్ సబ్ ఇనస్పెక్టర్ షేక్ మహబూభాషా, మంగళవారం స్దానిక రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆఖస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు,బాటిల్స్,నగదు పరిశీలించారు . అనంతరం ఆయన మాట్లాడుతు మద్యం దుకాణాలలో అమ్మకాలు జరిపిన నగదును మరస టిరోజు తప్పకుండా సక్రమంగా బ్యాంకులో జమ చేయాలని అన్నారు. బ్యాంకు నందు జమ చేసిన నగదు రశీదులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం షాపులు నిర్వహించాలని అన్నారు. అదే విధంగా రికార్డుల నందు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలని తెలిపారు. ప్రతిబాటిల్ స్కాన్ చేసి అమ్మాలని అన్నారు. మద్యం బాటిల్స్‌ను ఎంఆర్‌పి కంటే ఎక్కువకు అమ్మరాదని,అలా అమ్మని వారిపై చర్యలు తప్పవని అన్నారు. ఒకరికి రోజుకి మూడు బాటిల్స్ కంటే ఎక్కువ ఇవ్వరాదని,ప్రభుత్వం నిర్ణయించిన తేదిలలో నెలకు నాలుగుసార్లు దుకాణంలో స్టాకును తప్పకుండా స్కాన్ చేయాలని అన్నారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింతే వారి వివరాలను వెంటనే అధికారులకు తెలియజేయాలని అన్నారు. మద్యం దుకాణాల పరిశరప్రాంతాలలో మద్యం సేవించ రాదని అన్నారు. స్దానికంగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలలో రికార్డులు నగదు సక్రమంగా ఉన్నాయని ప్రభుత్వ నిబంధనలు ,ఆదేశాలు కాదని, దుకాణాంలో పనిచేసే సిబ్బంది వ్యవహారిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించా రు. ఈకార్యక్రమంలో సబ్బంది ఎన్ మురళీకృష్ణా,ఎం పద్మయ్య,విపి రత్నం ఉన్నారు.

## గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటన



**బిట్రగుంట, నవంబరు 15 ప్రభాతవార్త** బోగోలు మండలంలో ముంగమూరు, జువ్వలదిన్నె, ఎస్వీపాళెం తదితర గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరినారుమడులు మునిగి వుండటంతో తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు వివరించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక శాస్త్రవేత్తల బృందం డాక్టర్ జి.ఎల్.శివజ్యోతి, డాక్టర్ హెచ్. సి.ఓబయ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్‌నాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డిలు మండల వ్యవసాయాధికారిణి ఎస్.విజయలక్ష్మితో కలిసి ఆయా గ్రామాలలో పర్యటించారు. వరి నారుమడులు పొలాల్లో నిల్వ వున్న నీటిని వీలైనంత త్వరగా తీసివేయాలని రైతులకు సూచించారు. నీటిని పూర్తి తీసి వేసిన తర్వాత ప్రతి సెంటు నారుమడికి యూరియా వేయాల్సిందిగా సూచించారు. అలాగే అక్కడక్కడ లేత నారుమడులు కుళ్లి వుండటం గమనించి కేజి కార్బన్‌డిజం ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాల్సిందిగా వారు రైతులకు అవగాహన కల్పించారు.

## జెవిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు విస్తృతపరుస్తాం



**బిట్రగుంట, నవంబరు 15 ప్రభాతవార్త** జెవిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు మరింత ప్రజలకు అందుబాటులో వుండే విధంగా విస్తృతపర్చాలని సంకల్పించినట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మద్దిబోయిన శేషాద్రి యాదవ్ పేర్కొన్నారు. బోగోలులో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ జెవిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమి నేషనల్ అవార్డు క్రింద సేవారత్న అవార్డు ఈ నెల 13వ తేదిన న్యూఢిల్లీలో అందజేయడం జరిగిందన్నారు. ఈఅవార్డు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. అ వార్డు ప్రదానం చేసిన బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు ప్రధానోత్సవంలో తెలంగాణాకు చెందిన మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, తదితరులు తనను ఎంతగానో అభినందించి ప్రోత్సహించారని తెలిపారు.

## కృష్ణ మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటు



**కావలి, నవంబరు 15 ప్రభాతవార్త** సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటు అని కృష్ణ అభిమానులు తెలిపారు. కావలి ఏరియా వైద్యశాల వద్ద మంగళవారం సూపర్‌స్టార్ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కృష్ణ అభిమానులు మాజీ ఎయంసి మాజీ డైరెక్టర్ కాటా శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు కుందుర్తి కామయ్య, వేమిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాది ఎస్.ఎక్స్.కెనడీలు మాట్లాడారు. సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్ కృష్ణ రారాజుగా వెలిగారన్నారు. ఎన్నో విభిన్న పాత్రలు పోషించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ఫ్యాన్స్ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో సామాజిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



**కావలి, నవంబరు 15 ప్రభాతవార్త** విద్యార్థులు, యువత పుస్తక పఠనం ద్వారా సామాజిక విజ్ఞానాన్ని పెంపొందించుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కావలి పిజి సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.మంజుల పిలుపునిచ్చారు. కావలి వెంగళరావునగర్‌లోని శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శాఖ గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత ఆధ్వర్యంలో మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక ప్రదర్శనను అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.మంజుల ప్రారంభించారు. అనంతరం కావలి న్యాయస్థానాల మాదక ద్రవ్యాల నిషేధచట్టం సలహా కమిటీ సభ్యులు యం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలను సేవించడం వల్ల జరిగే దుష్ఫలితాలు గురించి అవగాహన కల్పించారు. గంజాయి, బ్రౌన్ షుగర్, మత్తు పానీయాలు వంటి వాటికి దూరంగా వుండి ఆరోగ్య వంతంగా వుండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు పుస్తక పఠనం ప్రాముఖ్యతను గుర్తించి జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు,గ్రంథాలయ సిబ్బంది పి.సుధాకర్. బిడిసిఎల్ సిబ్బంది, చదవరులు పాల్గొన్నారు.

## 35వ భారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలి



**మర్రిపాడు, నవంబర్15, ప్రభాతవార్త**: కేరళలో డిసెంబరు 13నుండి 16వరకు జరిగే అఖిలభారత కిసాన్ 35వ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆదివాసి గిరిజన రైతు నాయకుడు బిర్సాముండా జయంతి సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్సా ముండా జార్ఖండ్ రాష్ట్రంలోని ఉలిహటులో 1875 నవంబరు 15న జనిర్మించాడని ఆయన గిరిజనులకు భూములు కావాలని అనేక ఉద్యమాలు చేశారన్నారు. మోటార్లకు మీటర్లు భిగించే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటుధర కల్పించి రైతు భరోసా ఏంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్ళు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి



**కోవూరు, నవంబరు15 ప్రభాతవార్త :** విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేలా ట్రాన్స్‌కో అధికార సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని కావలి ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. కోవూరు ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ పరిధిలోని నేతాజీనగర్, కోవూరులో ఉన్న సబ్ స్టేషన్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ విషయంలో అంతరాయాలు కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన విధులు , బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కానున్న దృష్ట్యా విద్యుత్ లైన్లపై చెట్లు పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార ్యక్రమంలో ఆయన వెంట ట్రాన్స్‌కో డీఈ సతీష్‌బాబు, ఏఈ మునిరాజా, తదితరులు ఉన్నారు.

## చేజర్ల పరామర్శలు



**కోవూరు, నవంబరు 15 ప్రభాతవార్త :** జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార ్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి మంగళవారం పెద్ద పడుగుపాడు ప్రాంతానికి చెందిన టీడీపీ వీరాభిమాని ఇంతా భాస్కర్‌రెడ్డి మాతృమూర్తి కౌసల్యమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు శ్రీహరి, విజయ్, ఎస్‌కే నాసిర్, వహీద్, తదితరులు ఉన్నారు. అంతకు ముందు ఆయన అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాటూరు టీడీపీ నాయకుడు పృద్వీ శ్రీనివాసులు ఆరోగ్యపరిస్థితిని తెలుసుకుని వారికి ధైర్యంచెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్రరెడ్డి, నాగయ్యలు ఉన్నారు.

## పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబరు15 ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని పాడిరైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని పాల దిగుబడి పెంచుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాధవీలత అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాలలో ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా రైతులకు కావల్సిన మేలైన పెయ్య దూడలను 90 శాతం ఖచ్చితంగా పుట్టించి తద్వారా పాల దిగుబడి , రైతుల ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఇప్పటికే తమ పరిధిలో 10 పశువులకు మేలు జాతి ముర్రా సాహీవాల్ లింగ నిర్ధారిత వీర్య నాళికాలను కృత్రిమ గర్భధారణ ద్వారా అందజేయడం జరిగిందన్నారు. ఈ పథకం సంబంధించి ఆసక్తి కలిగిన పశు పోషకులు సంబంధిత గ్రామాల్లోని పశు వైద్యాధికారులను కలిసి ఒప్పందం చేసుకోవాలన్నారు. పాడి రైతులకు ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకాన్ని పాల ఉత్పత్తిదారుల సంఘాలు , మహిళా సంఘాలు ఇతర రైతు సంఘాలు పాడి రైతుల్లో అవగాహన పెంచి పాల ఉత్పత్తి పెంపుదలకు తోడ్పడాలని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.

## వ్యవసాయ శాఖ సలహాలు పాటించాలి



**కోవూరు, నవంబరు15 ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో నారు మ డులు జలదిగ్బంధంలో నిండిపోయా యి. ఈ మేరకు మండల వ్యవసాయాధి కారిణి ఇందిరావతి పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం నీట మునిగిన నారు మడులను కాలు వలు ఏర్పాటు చేసుకు ని నీరు బయటకు వెళ్లేలా రైతులు చొ రవ తీసుకోవాలన్నారు. వరి నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలన్నారు. ఐదు సెంట్ల నారు మడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను దుక్కిలోనే వేయాలన్నారు. చలిఎక్కువ ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలని సూచించారు. జింక్‌లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి రెండు గ్రాముల సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. సెంట్ నారుమడికి కార్బొఫిరాన్ 3జీ గులికలను 120 గ్రాముల చొప్పునవేయాలన్నారు. ఎక్కు వ వర్షపాతం వలన నారుమడులు ముంపుకు గురైతే వీలైనంత వరకు నీరును తీసివేసి ఒక సెంటుకు ఒక కేజీ యేరియా చల్లుకుని కార్బన్‌డిజన్ ఒక గ్రాము చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

## మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, నవంబరు15 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమపార్జనలో తమ ప్రాణాలను తృణప్రాయంగా పెట్టిన మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో 55వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో మహనీయుల జీవిత చరిత్రలు, విద్యార్థులకు అవసరమైన ఎన్నో పుస్తకాలు ఉన్నాయని, ప్రతి విద్యార్థి పుస్తక పఠనం తప్పక చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన 10వ వార్డు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫారాలు తమ సొంత నిధులతో కుట్టించి ఇస్తానని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. లైబ్రేరియన్ జె. సురేంద్రరెడ్డి, రిటైర్డ్ లైబ్రేరియన్ యానాదిరెడ్డి, ఆర్. సత్యనారాయణ, శ్రీనివాసులు, జివీ కృష్ణారెడ్డి, హనుమాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## బిజేపి నుంచి నక్క.దినేష్ యాదవ్ తొలగింపు

**నెల్లూరు నవంబర్ 15, ప్రభాతవార్త-వైద్యం** భారతీయ జనతా పార్టీలో జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ఉన్న నక్క.దినేష్ యాదవ్‌ని పార్టీని నుండి తొలగించినట్లు బిజేపి జిల్లా అధ్యక్షుడు గుండ్లవల్లి.భరత్‌కుమార్ మంగళవారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యుడుగా ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారతీయ జనతా పార్టీ కార్యాలయం నుండి వెలువడిన ప్రకటనలో భరత్‌కుమార్ వెల్లడించారు.

